క్లుప్తంగా

ఎంబీబీఎస్‌లో ప్రవేశాలకు ఎంపిక


కొళ్ల చక్రవర్తి


భోగి వికాస్

భామిని: మండల కేంద్రానికి చెందిన ఇద్దరు విద్యార్థులు ఎంబీబీఎస్‌కు అర్హత సాధించారు. నీట్‌లో అత్యధిక మార్కులు సాధించిన కొళ్ల చక్రవర్తి పాడేరు మెడికల్ కాలేజీకు.. భోగి వికాస్ ఒంగోలు మెడికల్ కళాశాలకు ఎంపికయ్యారు. దీంతో వీరిని పలువురు అభినందించారు.

మద్యం దుకాణాల్లో ఆకస్మిక తనిఖీలు


మద్యం షాపులో తనిఖీలు చేస్తున్న ఎక్సైజ్ అధికారులు

కురుపాం/గుమ్మలక్ష్మీపురం: స్థానిక ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని గుమ్మలక్ష్మీపురంలో ఉన్న మద్యం దుకాణాల్లో ఎక్సైజ్ అధికారులు గురువారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఎమ్మార్పీ కన్నా ఎక్కువ ధరకు మద్యం విక్రయాలు జరుగుతున్నాయన్న ఆరోపణల నేపథ్యంలో ఈ తనిఖీలు చేయడం జరిగింది. అయితే అధిక ధరకు మద్యం విక్రయాలు జరగనట్లుగా తమ దృష్టికి వచ్చిందని అధికారులు తేల్చిచెప్పారు. ఎవరైనా ఎమ్మార్పీ కన్నా ఎక్కువకు విక్రయిస్తే రూ.5 లక్షల జరిమానా విధించడం జరుగుతుందని, రెండోసారి పట్టుబడి షాపు లైసెన్స్ రద్దు చేస్తామని హెచ్చరించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం అన్ని రకాల మద్యం బ్రాండ్‌లు అందుబాటులో ఉంచాల తెలిపారు.

స్కూటీపై వెళ్తుండగా గుండెపోటు

● మృతి చెందిన వాహనదారుడు


ఘటన స్థలంలో మృతి చెందిన సూర్యనారాయణ

గరుగుబిల్లి: స్కూటీపై వెళ్తుండగా గుండెపోటుకు గురై ఓ వ్యక్తి మృతి చెందిన విషాద ఘటన మండలంలోని తోటపల్లి ఐటీడీఏ పార్కు సమీపంలో గురువారం జరిగింది. వివరాలిలా ఉన్నాయి.. పెద్దింటి సూర్యనారాయణ(45) అనే వ్యక్తి మధ్యాహ్నం తన గ్రామానికి వస్తున్న బంధువులను కలిసి వారిని తీసుకు వచ్చేందుకు స్కూటీపై బయలుదేరాడు. ఇలా వెళ్తుండగా పార్కు దగ్గరలో అకస్మాత్తుగా గుండెపోటుకు గురై స్కూటీపై కుప్పకూలిపోయాడు. స్థానికుల ద్వారా ఈ సమాచారం తెలుసుకున్న కుటుంబ సభ్యులు హుటాహుటిన ఘటన స్థలానికి చేరుకుని కన్నీరుమున్నీరుగా విలపించారు.

కుక్కల దాడిలో 10 కోళ్లు మృత్యువాత


చనిపోయిన కోళ్లను చూపిస్తున్న బాధితుడు ప్రసాదరావు


గుమ్మలక్ష్మీపురం: మండలంలోని దుడ్డుఖల్లు పంచాయతీ, విశ్వనాథపురంలో పాడి ప్రసాదరావుకు చెందిన నాటుకోళ్లపై కుక్కలు దాడికి ఎగబడ్డాయి. ఈ ఘటనలో 10 కోళ్లు మృత్యువాత పడ్డాయి. దీంతో రూ.20 వేల వరకు నష్టం జరిగిందని బాధితుడు ప్రసాదరావు వాపోయాడు. స్వయం ఉపాధిలో భాగంగా చిన్నపాక వేసుకుని అందులో 45 కోళ్లను పెంచుతున్నానని, వినాయక చవితి పూజలకు వెళ్లగానే కుక్కలు పాకలో ప్రవేశించి కోళ్లను చంపేసి తినివేశాయని తెలిపాడు. అధికారులు స్పందించి, నష్టపరిహారం వచ్చేలా చూడాలని వేడుకున్నాడు.

స్వమిత్వ సర్వే వేగవంతం


సీతానగరం: మండలంలోని సచివాలయ ఉద్యోగులు నిర్వహిస్తున్న స్వమిత్వ సర్వేకార్యక్రమాన్ని నిశితంగా పరిశీలించి వేగవంతం చేయాలని డిప్యూటీ ఎంపీడీఓ కె.కుమారవర్మ అన్నారు. ఈ మేరకు మండలంలోని ఇప్పలవలస గ్రామంలో ఇంటింటికీ వెళ్తున్న ఇంజినీరింగ్ సహాయకులు, పంచాయతీ కార్యదర్శి, సర్వే సహాయకులు గురువారం నిర్వహించిన సర్వేను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో ఉన్న పక్కా గృహాలు, ఇళ్లస్థలాలు, ఇతర కట్టడాలు, ప్రభుత్వ స్థలాల కొలతలపై అవగాహన కల్పించుకుని నిబంధనలకు లోబడి కొలతలు వేయాలని కోరారు. ఇంటికి సంబంధించిన పొడవు-వెడల్పు, భవనానికి సంబంధించిన బుక్ వేల్యూ, ప్రస్తుతం ఉన్న ఇంటి విలువను గుర్తించాలని సూచించారు. కార్యక్రమంలో ఇంజినీరింగ్ సహాయకురాలు చందన, సర్వేయర్ భాను, కార్యదర్శి పాల్గొన్నారు.

కొలువైన గణనాథులు


వీరఘట్టం: కూరాకుల వీధిలో ఏర్పాటు చేసిన 12 అడుగుల గణపతి


వీరఘట్టం : కొండవీధిలో మత్స్యకారులు ఏర్పాటు చేసిన భారీ గణపతి


వీరఘట్టం: ఊరేగింపుగా వస్తున్న గణనాథులు


వీరఘట్టం : సెగిడివీధిలో ఏర్పాటు చేసిన నంది వాహనంపై గణపతి


గరుగుబిల్లి: నాగూరు నఖచిత్రకారుడు పరిశినాయుడు గీసిన నాట్యగణపతి వర్ణచిత్రం


వీరఘట్టం: వడ్డివీధిలో ఏర్పాటు చేసిన 12 అడుగుల గణపతి


పాలకొండ: వినాయక విగ్రహాన్ని తీసుకెళ్తున్న భక్తురాలు


పాలకొండ: పట్టణంలోని బోనం వీధిలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహం


పాలకొండ: ఏలాం సెంటర్‌లో ఏర్పాటు చేసిన భారీ విగ్రహం


కొమరాడ: రాజ్యలక్ష్మీపురంలో కొలువైన లంబోదరుడి వద్ద భక్తుల పూజలు

విఘ్నాలు తొలగించే వినాయకుడు వాడవాడలా కొలువుదీరాడు. బుధవారం ఉదయం ప్రత్యేక పూజలతో ప్రతిష్ఠించిన గణనాథులకు విశేష పూజలు నిర్వహిస్తున్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా వినాయక ఉత్సవాలు నిర్వహిస్తుండడంతో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. మంటపాల వద్ద సాయంత్రం వేళ చిన్నారులు, యువత నృత్యాలతో సందడి చేస్తున్నారు. వీరఘట్టం కూరాకుల వీధిలో 15 మట్టి వినాయక విగ్రహాలు ఏర్పాటు చేసి సాయంత్రం మేళ,తాళాల నడుమ నిమ్మనం చేశారు. పాలకొండ ఏలాం సెంటర్‌లో 15 అడుగుల విగ్రహం భక్తులను అలరిస్తోంది.

- పాలకొండ/కురుపాం నెట్‌వర్క్


పాలకొండ రూరల్: జగన్నాథ స్వామి ఆలయ సమీపంలో కొలువైన మహా బాలగణపతి


పాలకొండ రూరల్: వైఎస్సార్‌వీధిలో భక్తుల పూజలందుకుంటున్న వరసిద్ధి వినాయకుడు


భామిని: పూజలందుకుంటున్న గణనాథుడు


భామిని: బాలేరులో వినాయకుని సన్నిధిలో ప్రత్యేక పూజలు చేస్తున్న భక్తులు


గరుగుబిల్లి: ఉల్లిభద్రలో వినాయకుడికి పూజలు చేస్తున్న భక్తులు


గుమ్మలక్ష్మీపురంలో విఘ్నేశ్వరునికి పూజలు చేస్తున్న భక్తులు


వెంకటరాజపురంలో గణేశుడికి పూజలు చేస్తున్న భక్తులు

నేత్రదానంపై అవగాహన


నేత్రదానంపై అవగాహన కలిగిస్తున్న రెడ్‌క్రాస్ సిబ్బంది, విద్యార్థులు

పాలకొండ: జాతీయ నేత్రదాన పక్షోత్సవాల సందర్భంగా గురువారం స్థానిక తమ్మినాయుడు కళాశాల ఆవరణలో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ, మగుటపల్లి కల్యాణినేత్ర సేకరణ కేంద్రం ఆధ్వర్యంలో గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా రెడ్‌క్రాస్ ప్రతినిధులు కె. సత్యనారాయణ, పి. చైతన్యకుమార్, జి. రమణ, పి. సుజాత నేత్రదానంపై అవగాహన కలిగించారు. నేత్రదానం ద్వారా మరో ఇద్దరికి కంటిచూపు ఇవ్వగలమన్నారు. కార్యక్రమంలో కళాశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలి


రికార్డులు పరిశీలిస్తున్న సబ్‌కలెక్టర్ వైశాలి

కురుపాం: స్థానిక ఏకలవ్య ఆదర్శ రెసిడెన్షియల్ పాఠశాలను పార్వతీపురం సబ్‌కలెక్టరు ఆర్.వైశాలి గురువారం సందర్శించారు. విద్యార్థుల వసతిగృహం సహా వారి తరగతి గదులు, వంటగది, రికార్డులు పరిశీలించి, సిబ్బందికి పలు సూచనలు చేశారు. ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్యతో పాటు ఆహారం కూడా అందివ్వాలని సూచించారు. విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో విద్యాబోధన చేయాలని, పాఠశాల పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చూడాలన్నారు.

తనిఖీలు

భామిని: మండలంలోని బత్తిలిలో పలు హోటళ్లను స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి కొండపల్లి రవీంద్ర గురువారం తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా శుభ్రమైన వాతావరణంలో వంటలు చేస్తున్నదీ, లేనిదీ ఆరా తీశారు. అపరిశుభ్ర వాతావరణంలో వంటలు చేసినా, నాసిరకం సరుకులు వినియోగించినా చర్యలు తప్పవన్నారు.

● అలరించిన చిన్నారుల నృత్యాలు



వీరఘట్టం: వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని స్థానిక కూరాకులవీధిలో శ్రీకృష్ణా సేవా సంఘం ఆధ్వర్యంలో బుధవారం రాత్రి ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి. ఈ సందర్భంగా చిన్నారుల నృత్యాలు ఆకట్టుకున్నాయి.

విఘ్నేశ్వరునికి వినతిపత్రం అందజేత


వినాయకుడికి వినతిపత్రం అందజేస్తున్న సీఐటీయూ నాయకులు

కొమరాడ: మండల కేంద్రంలోని మరడనా వీధిలో కొలువైన వినాయకుడిని సీఐటీయూ నాయకులు గురువారం దర్శించుకుని, ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా మండల ప్రజల కష్టాలు తీర్చాలని వేడుకుంటూ మండల సీఐటీయూ నాయకుడు కొల్లి సాంబమూర్తి తదితరులు విఘ్నేశ్వరునికి వినతిపత్రం అందజేశారు. 2018లో ఒడిశా నుంచి ఇక్కడకు వచ్చి తిష్టవేసిన ఏనుగుల గుంపుతో ఈ ప్రాంత ప్రజలు పంటనష్టంతో పాటు ప్రాణనష్టం ఎదుర్కొంటున్నారని తెలిపారు. అలాగే నాగావళి నదిపై వంతెన లేకపోవడంతో ఎంతోమంది నదిలో ప్రయాణించి ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. పూర్ణపాడు-లాబేస్ వద్ద వంతెన నిర్మాణం నిలిచిపోయిందని, ఈ సమస్యలన్నీ తీర్చేలా ప్రభుత్వానికి బుద్ధి ప్రసాదించాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

గుమ్మలక్ష్మీపురం: రస్తాకుంటుబాయి 11 కేవీ ఫీడర్ పరిధిలోని పలు ప్రాంతాలకు శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతున్నట్లు ఏడీఈ మండంగి రాజేంద్రప్రసాద్ ఓ ప్రకటనలో గురువారం తెలిపారు. విద్యుత్ తీగలను తాకే చెట్లకొమ్మల తొలగింపు పనుల నేపథ్యంలో గుమ్మ, ఆమిటి, మండ, కుంటుబాయి, టక్కబాయి గ్రామాలకు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు కరెంట్ సరఫరా నిలిపివేస్తున్నామన్నారు.

జియ్యమ్మవలస రూరల్: విద్యుత్ నిర్వహణ పనుల కారణంగా మండలంలోని చినకుదమ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో ఉన్న కుందరతిరువాడ, ఇటిక, గదబవలస, నీచుకవలస, గెడ్డతిరువాడ, అంకవరం, తురకనాయుడు ప్రాంతాలకు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు కరెంట్ సరఫరా నిలిపివేస్తున్నామని అధికారులు వెల్లడించారు.

భామిని: మండలంలోని 11 కేవీ విద్యుత్ లైన్ పరిధిలో జంగిల్ క్లియరెన్స్ పనులు చేపట్టనున్న నేపథ్యంలో శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 వరకు వరకు సరఫరా ఉండదని ఏఈ బి. శ్రీనివాస్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. బొమ్మిక, పక్కుడుబద్ర, మనుమకొండ, పాలవలస, బత్తిలి గ్రామాలకు సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఎరువుల కోసం ఆందోళన


డీటీ ప్రసాద్‌కు వినతిపత్రం అందిస్తున్న రైతులు

పాలకొండ: ఎరువులు అందించాలని కోరుతూ పలువురు రైతులు గురువారం స్థానిక రెవెన్యూ కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా అభ్యుదయ రైతు కండాపు ప్రసాదరావు మాట్లాడుతూ.. ఈ ఏడాది యూరియా దొరకక రైతులు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. రైతుల సమస్యలపై పాలకులు నోరు మెదపడం లేదని ఆరోపించారు. అరకొరగా వచ్చిన యూరియాను బ్లాక్‌మార్కెట్‌కు తరలిస్తున్నారని మండిపడ్డారు. తప్పనిసరి పరిస్థితుల్లో రైతులు ప్రైవేట్ వర్తకుల వద్ద అధిక ధరలకు యూరియా కొనుగోలు చేస్తున్నారని తెలిపారు. అనంతరం ఉప తహసీల్దార్ ప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఇద్దుబోయిన సింహాద్రి, దుప్పాడ దుర్గారావు, రౌతు రఘు, కాద రాము, కె. సాయికుమార్ పాల్గొన్నారు.

● పొంగిపొర్లిన గెడ్డ



సీతంపేట: భారీ వర్షాలకు కుశిమి జంక్షన్ వద్ద గెడ్డ పొంగి పొర్లుతోంది. దీంతో రాకపోకలకు ప్రజలు, వాహనదారులు ఇబ్బంది పడ్డారు. ప్రతి ఏటా వర్షాకాలంలో ఇబ్బందులు తప్పడం లేదని అధికారులు, పాలకులు స్పందించి ఈ గెడ్డపై బ్రిడ్జి నిర్మించాలని పలువురు కోరుతున్నారు.

యూరియా కోసం తప్పని తిప్పలు


నులకజోడు ఆర్‌ఎస్‌కే ముందు బారులుదీరిన రైతులు

భామిని: మండల రైతాంగానికి యూరియా ఇక్కట్లు తీరడం లేదు. ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి ఇంతవరకు యూరియా అందించకపోవడంతో పంటలు ఎలా పండించాలో తెలియక అన్నదాతలు తలలు పట్టుకుంటున్నారు. భామిని, బొడ్డగూడ, నులకజోడు, బాలేరు ఆర్‌ఎస్‌కేలకు పది టన్నుల చొప్పున యూరియా వచ్చిందని ఏఓ కొల్లి తిలక్ గురువారం ప్రకటించడంతో.. రైతులందరూ ఆర్‌ఎస్‌కేలకు చేరుకుని బారులుదీరారు. అలాగే నేరడి-బి, భామిని, చిన్నదిమిలి, కోసలి ఆర్‌ఎస్‌కేలకు డీఏపీ వచ్చిందని పది టన్నుల చొప్పున వచ్చినట్లు ఏఓ చెప్పారు.

విరిగిపడిన కొండచరియలు


రోడ్డు మధ్యలో పడిన బండరాళ్లు

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని మంత్రజోల గ్రామ రోడ్డులో కొండచరియలు విరిగిపడ్డాయి. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు రోడ్డు పక్కనే ఉన్న కొండ పైనుంచి పెద్దపెద్ద బండరాళ్లు, మట్టి కిందికి జారిపడ్డాయి. దీంతో ఆ దారిలో వాహనాల రాకపోకలకు ఇబ్బంది ఏర్పడింది. విషయం తెలుసుకున్న అధికారులు అక్కడకు చేరుకుని, రోడ్డుకు అడ్డంగా ఉన్న రాళ్లను తొలగించి, ప్రజల రాకపోకలకు మార్గమం సుగమం చేశారు.